

మేటి ప్రయోక్త

పోలీసు చర్య తర్వాతే దాశరథి మొదలైన ఖైదీలకు విముక్తి లభించింది. వరంగల్ జైలులో జొన్నరొట్టెలలో సిమెంటు కలిపి ఇచ్చేవారు. అవి తిని ఎందరో అజీర్ణంతో మరణించారు. దాశరథి జీర్ణకోశం చెడిపోయింది, ఆ బాధ ఆయన్ను జీవితకాలం వేధించింది. జాతి క్షేమం కోసం జీవితం బలిచేసిన కవి ఆ జాతి తలపుల్లో సదా స్మరణీయుడు. కఠిన కారాగారంలో, చిత్రహింసల కొలిమిలో కడతేరుతూ, కవోష్ణ రుధిరధార లాంటి కవిత్వం సృష్టించారు దాశరథి. ఆ కవితా కరవాల ధారనే ఆయన తొలి కావ్యం 'అగ్నిధార'...

**ఆయాసపడు జైలులో యెన్ని ప్రజల రా**
**జ్యములున్నవో! యని అరసినాను**
**నిరుపేదవాని నెత్తురు చుక్కలో నెన్ని**
**విప్లవాలో! యని వెదకినాను..**

జైలులో ప్రజారాజ్యం కోసం అన్వేషించటం, నిరుపేద నెత్తురు చుక్కల్లో విప్లవాలను దర్శించటం విరుద్ధ శక్తుల ఘర్షణలో జనించే చలనాన్ని, జ్వలనాన్ని, పురోగమనాన్ని అద్భుతంగా వ్యక్తీకరించారు దాశరథి. కాలమనే దైవజ్ఞుడు, జగత్తు అనే కన్య అరచేతి రేఖలు చూసి చూసి, 'ప్రజలను హింసించే వాళ్లు బాగుపడు మాట వట్టిదని నశించి తీరతారని జోస్యం చెప్పాడట..... 'జైలులో' అనే శీర్షికతో రాసిన ఈ పద్య కవిత ఉత్కృష్ట భావుకతతో ప్రారంభమై ముగింపులో ఉదాత్త తాత్త్విక స్థాయికి చేరుకుంటుంది.

### అగ్నిధార- అశ్రుధార

'ఏడు వందల మందికి ఒక్కటే పంపు/ ఎట్లాభరించేది ఈ పాడుకంపు...' అంటూ ఒక గేయం పాడుతూ వట్టికోట ఆళ్వారు స్వామి జైలులోని నీళ్ల పంపు దగ్గరికి వచ్చాడు. అక్కడే అగ్నిధార, అశ్రుధార ఆలింగనం చేసుకున్నాయి.

ఆళ్వారుస్వామిది ఆజానుబాహు విగ్రహం. పచ్చని దేహచ్ఛాయ. చిన్నచెడ్డీ, చాలీచాలని గీట్ల అంగీ, నెత్తిన చిన్నటోపీ.. హత్యలు చేసి శిక్షలు పొందిన వారికిచ్చే దుస్తులు ఆయనకిచ్చారట. ఆయనకు కవులంటే ముఖ్యంగా దాశరథి అంటే ఎక్కడలేని అభిమానం.

ఒకనాడు పళ్లు తోముకోవడానికి ఇచ్చిన బొగ్గుముక్కతో జైలుగోడ మీద శక్తిమంతమైన పద్యం ఒకటి రాశారు దాశరథి. బోనులో ఉన్నా సింహం గర్జించటం మానదు కదా!

**ఓ నిజాము పిశాచమా! కానరాడు**
**నిన్నుబోలిన రాజు మాకెన్నడేని**
**తీగెలను తెంపి అగ్నిలో దింపినావు**
**నా తెలంగాణ కోటిరత్నాల వీణ**

అధికారులు కన్నెర్ర చేశారు. మలిపేశారు. కానీ పద్యం గోడల మీద మళ్లామళ్లా ప్రత్యక్షం అవుతూనే ఉన్నది. ఆఖరికి ఆళ్వారుస్వామీ రాస్తున్నాడని కనిపెట్టేశారు. చిత్రహింసలకు గురి చేశారు. దాశరథిని చంచల్‌గూడా జైలుకు, ఆళ్వారుస్వామిని గుల్బర్గా జైలుకు మార్చేసరికి ఆ ఇద్దరి మూడునెలల జైలు సావాసం ముగిసింది.

అసలు ఆళ్వార్లు పన్నెండు మందే/పదమూడో ఆళ్వార్ మా వట్టికోట ఆళ్వారుస్వామి/అంటూ గొప్ప ఎలిజీ రాశారు దాశరథి. అకాల మృత్యువు పాలైన ఆళ్వారుస్వామికి, దాశరథి తన తొలికావ్యం అగ్నిధారను అంకితం చేశారు.

***

దాశరథి పద్యంలో ఒక అద్భుతమైన వేగం ఉంటుంది. జలపాతపు హోరుతో, జవనాశ్వపు జోరుతో భావోద్వేగ భరితమైన దాశరథి కవిత ప్రవాహధార చదివేవారిని, వినేవారిని సమ్మోహితుల్ని చేస్తుంది. సీసం, తేటగీతి, ఆటవెలది, కందం, ఉత్పలమాల, చంపకమాల, శార్దూలం, మత్తేభం... ఇలా ఛందస్సు



భార్యాపిల్లలతో..

## సుసంపన్న సంస్కృతికి ప్రతీక

**నా పాతమిత్రులు ఎవరో తెలుసా**
**గాలిబూ కాళిదాసు**
**నా కొత్తమిత్రులు నజ్రులిస్లాం, టాగోర్**
**మంచి కవిత్వం ఏ భాషలో**
**ఉంటే అది నా భాష**
**మంచి కవి ఎవరైతే అతడు నా మిత్రుడు**

అని ప్రకటించిన దాశరథి తెలంగాణ సంపద్వంత సాహిత్య సంస్కృతికి నిలువెత్తు ప్రతీక. అగ్నిధార, రుద్రవీణ, మహాంధ్రోదయం, పునర్నవం, అమృతాభిషేకం, కవితా పుష్పకం, ఆలోచనా లోచనాలు, తిమిరంతో సమరం తదితర కావ్యాలతో తెలుగు సాహిత్యానికి, ఉర్దూ రచనలూ, అనువాదాలతో ఉర్దూ సాహిత్య వికాసానికి దాశరథి ఎనలేని సేవ చేశారు. తెలుగులో తొలిసారిగా స్వతంత్రమైన గజళ్లను రచించి గజల్ ప్రక్రియను పండించిన ఘనత కూడా దాశరథిదే. ఆయన కలానికి పరుసవేదికి ఉన్న శక్తి ఉంది. పద్యం, గేయం, వచన కవిత, గజల్, రుబాయీ అన్ని ప్రక్రియలలోనూ ఆయన శక్తిమంతమైన కవిత్వం సృష్టించారు. దాశరథి కవిత్వ భాష వెనుక సంస్కృత పాండితీ గరిమ, పారశీక ఉర్దూ కవిత్వ ప్రభావం వలన వచ్చిన ఎనలేని భావుకత, శబ్ద సౌందర్య స్పృహ ఉన్నాయి. ఇవన్నీ అన్వయించి – ఈ నేపథ్యం నుంచి ఆయన కవిత్వాన్ని ఎలా విశ్లేషించాలో నేర్చుకోవాల్సి ఉంటుందని అన్నారు ఆచార్య రవ్వా శ్రీహరి.

భారతదేశానికి గాలిబ్ కవిత, తాజ్ మహల్ మరువలేని అందాలని అంటారు దాశరథి. జక్కీసాబ్ పాఠాల ప్రభావంతో చిన్నప్పటి నుంచే మీర్జా గాలిబ్ కవిత్వంపై దాశరథి ఇష్టం పెంచుకున్నారు. అనువదించాలని అనుకున్నారు. పెద్దయ్యాక తెలుగువారికి గాలిబ్ కవిత్వాన్ని పరిచయం చేసి ఆ కోరికను నెరవేర్చుకున్నారు. దాశరథి అనువాద పటిమను చూసి ముచ్చటపడిన దేవులపల్లి రామానుజరావు... దుర్లభుడనుకున్న గాలిబ్‌ను, దాశరథి సులభుణ్ని చేశారని చమత్కరించారు. క్లిష్టతరమైన గజల్ ప్రక్రియను అచ్చమైన తెలుగు భావనలతో, వ్యక్తీకరణలతో తొలిసారిగా అనితరసాధ్యంగా తెలుగు సాహిత్యంలో ఆవిష్కరించినదీ దాశరథియే.